సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 7 । జనవరి । 2024



ఐఎస్‌ఎల్‌కు సన్నద్ధం 10లో▸

ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా నిర్వహించనున్న ఐఎస్‌ఎల్ క్రీడా పోటీలకు ఉట్నూర్ వేదిక కానుంది. ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు క్రీడా సంబురం కొనసాగనుంది.



సైబర్ దోపిడీ! 8లో▸

సులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడొద్దు. సైబర్ కేటుగాళ్ల మాయమాటల ఉచ్చులో పడితే బ్యాంకు ఖాతా ఖాళీ అవడం ఖాయం.

గరిష్టం/కనిష్టం
29.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలిప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రతీ ఠాణాలో రిసెప్షన్ రూం

• డీఎస్పీ నాగేందర్



రిసెప్షన్ రూం ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ రూం ఏర్పాటు చేయనున్నట్లు ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన రిసెప్షన్ రూంను శనివారం ఆయన ప్రారభించి మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకే వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన సిబ్బందిని సంప్రదించి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఇందులో సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు డీఈవో ప్రణీతను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 657 మంది పనిచేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సెక్టోరియల్ అధికారులు సుజాత్‌ఖాన్, నారాయణ, ఉస్మాన్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సీసీఓలు, ఐఆర్‌పీలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ ప్రజారోగ్య వైద్య, ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరావు, సంతోష్, నాయకులు రవీందర్, బాబులాల్, ఆనందరావు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి శివరాం ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ డా. పి.శివరాం ప్రసాద్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉంటేనే తమ హక్కులు, బాధ్యతలు తెలుస్తాయన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ క్రైం, వరకట్న నిషేధ తదితర చట్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన జనం



ఆధార్ కేంద్రం తెరువక ముందే క్యూ ఇలా



ఆధార్ .. క్యూ!

• ఆగని ఈకేవైసీ కష్టాలు
• టోకెన్ల కోసం జనం బారులు

కైలాస్‌నగర్: జిల్లావాసులను ఆధార్ ఇక్కట్లు వీడడం లేదు. రేషన్‌కార్డులోని సభ్యులంతా తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో వచ్చే నెల నుంచి బియ్యం రావనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ఆధార్ అప్‌డేట్ కోసం జనం అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ప్రస్తుతం సీసీఎస్ కేంద్రాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, మీ సేవలోని ఆధార్ కేంద్రాల్లో అప్‌డేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇందు కోసం రోజువారీగా ముందుగా టోకెన్లు జారీ చేస్తున్నారు. అయితే వాటిని పొందేందుకు వేకువజామునే ఆయా సెంటర్ల వద్దకు ప్రజలు పరుగు పెడుతున్నారు. అవి తెరువక ముందే కుటుంబ సభ్యులతో కలిసి బారులు తీరుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో శనివారం టోకెన్లు జారీ చేయడంతో జనం భారీగా తరలివచ్చారు. ఆవరణ నిండిపోవడంతో పాటు కలెక్టరేట్ వరకు బారులు తీరారు. అయితే రోజుకు 50 టోకెన్లు మాత్రమే అందిస్తున్నామని, నెల రోజుల వరకు పూర్తయినట్లు అధికారులు పేర్కొనడం గమనార్హం.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు

ప్రజాపాలన @ 2,25,004

• ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
• మొదలైన ఆన్‌లైన్ నమోదు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 28 నుంచి ఈనెల 6 వరకు చేపట్టిన ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలు, ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో అధికారులు గ్రా మ, వార్డు సభలు నిర్వహించారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనాభాకు అనుగుణంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ క్ర మంలో ఆయా పథకాల లబ్ధికోసం కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,25,004 దరఖాస్తులు అందగా.. ఇందులో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 48,655 ఉన్నాయి. ఆరు గ్యారంటీలతో పాటు రేషన్ కార్డులు వంటి ఇతర పథకాల కోసం కూడా జనం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వీటి కోసం జిల్లావ్యాప్తంగా 28,792 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజైన శనివారం అభయహస్తం కోసం జిల్లాలో 18,675 దరఖా స్తులు రాగా, మున్సిపల్ పరిధిలో 3,499 కలిపి మొత్తంగా 22,174 దరఖాస్తులు అందాయి. ఇతర పథకాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో 5,220 దరఖాస్తులు రాగా మున్సిపల్ పరిధిలో 5,286 అందాయి. వాటి వివరాలను ప్రజావాణి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించి శిక్షణ అందించారు. కంప్యూటర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఈ నమోదు ప్రక్రియ చేపట్టారు.

మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు..

మండలం	గ్రామాలు	అభయహస్తం దరఖాస్తులు	ఇతర పథకాలకు
ఆదిలాబాద్‌రూరల్	34	11,317	1,018
బజార్‌హత్నూర్	30	9,559	2,275
బేల	37	12,661	1,684
భీంపూర్	26	8,055	1,448
బోథ్	33	14,842	2,834
గాదిగూడ	25	5,687	758
గుడిహత్నూర్	26	10,209	2,177
ఇచ్చోడ	32	13,849	3026
ఇంద్రవెల్లి	28	12,276	2,352
జైనథ్	42	17,144	1,189
మావల	03	1,809	240
నార్నూర్	23	9,041	1,205
నేరడిగొండ	32	8,475	1,571
సిరికొండ	19	5,438	1,251
తలమడుగు	28	11,717	2,801
తాంసి	13	5,709	892
ఉట్నూర్	37	18,561	2,071
	468	1,76,349	28792

మున్సిపాలిటీ	వార్డులు	దరఖాస్తులు	ఇతర పథకాలకు
ఆదిలాబాద్	49	48655	368

ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి

• కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని నలంద కళాశాలలో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌నంబర్లు సరిచూసుకొని దరఖాస్తులను తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. గడువు లోపు నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శైలజ, రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ తదితరులున్నారు.



దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ముసాయిదా.. విడుదల

• ఓటరు జాబితా వెల్లడి
• జిల్లా ఓటర్లు 4,49,980
• పురుషులతో పోల్చితే మహిళలే అధికం
• కొత్తగా 7,542 మంది నమోదు
• 22 వరకు అభ్యంతరాల స్వీకరణ



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 4,49,980 మంది ఓటర్లున్నట్లుగా అధికారులు తేల్చారు. ఇందులో పురుష ఓటర్లు 2,20,107 మంది, మహిళా ఓటర్లు 2,29,865 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లు 9758 మంది ఎక్కువగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం -2024లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం విడుదల చేశారు. ఈ జాబితాను కలెక్టర్ కార్యాలయం, ఆదిలాబాద్, బోథ్ రిటర్నింగ్ అధికారులైన ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఆయా తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. అలాగే బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ)ల వద్ద కూడా జాబితాను అందుబాటులో ఉంచనున్నారు.

కొత్తగా నమోదైన ఓటర్లు 7,542

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గతేడాది అక్టోబర్ 4న విడుదల చేసిన ఓటర్ల జాబితాతో పోల్చితే జిల్లాలో 7,542 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 5,868 మంది, బోథ్ నియోజకవర్గంలో 1,674 మంది ఉన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,41,616 మొత్తం ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 1,18,666 మంది, మహిళలు 1,22,944, ఇతరులు ఆరుగురు ఉన్నారు.ఇక బోథ్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,08,364 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,01,441, మహిళలు 1,06,921, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

22 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల6 నుంచి 22 వరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరిస్తారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్పులు, చేర్పులు, అభ్యంతరాలతో పాటు ఓటర్ల నమోదు కోసం ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను ఫిబ్రవరి 2నుంచి 24వ తేదీ వరకు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటించనున్నట్లుగా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. అర్హులైన యువత బీఎల్‌వోల ద్వారా ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మండలం	పోలింగ్‌కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
జైనథ్	55	19,105	19,843	00
బేల	41	15420	15345	00
ఆదిలాబాద్‌రూరల్	48	16,602	17,525	02
మావల	41	18,357	19,163	01
ఆదిలాబాద్‌అర్బన్	105	49,182	51,068	03
భీంపూర్	28	9,131	9,802	00
తాంసి	17	6,483	7,061	00
తలమడుగు	43	13,191	13,814	00
గుడిహత్నూర్	36	12,065	12,487	00
ఇచ్చోడ	48	16,592	17,414	01
సిరికొండ	09	3,374	3,553	00
బజార్‌హత్నూర్	37	11,433	11,787	00
బోథ్	49	17,913	19,117	01
నేరడిగొండ	35	11,259	11,886	00

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశ నుంచే అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ అగ్నిమాపక కేంద్ర అధికారి శివాజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయపడకుండా ముందుగా ఫైర్ అధికారులకు టోల్ ఫ్రీ నంబర్ 101కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కొంత మంది సరైన అడ్రస్ చెప్పని కారణంగా సమయానికి అక్కడికి వెళ్లలేకపోతున్నామని అప్పటికే ఆస్తి నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రమాద స్థలం వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉన్నప్పటికీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు లేరన్నారు. ముగ్గురు ఎస్జీటీలతో పదో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తున్నారని, సైన్స్, గణితం బోధించే వారు లేక నష్టపోతున్నారన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా సిలబస్ ఇంకా పూర్తి కాలేదని విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అబ్దుల్ రషీద్, విద్యార్థుల తల్లిదండ్రులు అనీస్, అబ్దుల్ సత్తర్, ఫయాజ్ ఖాన్, జహీర్, అమీన్, ఫిరోజ్‌ఖాన్, అన్వరుద్దీన్ పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఇచ్చోడ: రానున్న ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల బాలుర, బాలికల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రీజినల్ ఇగ్నైట్ ఫెస్ట్‌ను విజయవంతం చేసిన ప్రిన్సిపాళ్లు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో బాలుర ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హరిరాం, బాలికల వైస్‌ప్రిన్సిపాల్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్సీవో గంగాధర్

క్లుప్తంగా

నిజాయతీ చాటుకున్న హోంగార్డులు



రింగును అందిస్తున్న హోంగార్డులు

భైంసా: బాసర ఆలయంలో భక్తులు పోగొట్టుకున్న బంగారు రింగును తిరిగి ఇచ్చి హోంగార్డులు నిజాయతీ చాటుకున్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నిప్పెటపాడు గ్రామానికి చెందిన నరేశ్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి బాసర వచ్చారు. ఆలయంలో తమ కూతురు బంగారు రింగును పోగొట్టుకుంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అశోక్, శోభ, వెన్నెలకు ఈ రింగు దొరకడంతో నరేశ్‌బాబు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజాయతీ చాటుకున్న హోంగార్డులను పలువురు అభినందించారు.

ఆవుకు అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న రైతులు

కుంటాల: మండలంలోని లింబా(కె)లో రైతు దేవన్నకు చెందిన ఆవు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. 35 ఏళ్లుగా తన వద్ద ఉన్న ఆవు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, రైతులు గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

సైబర్ దోపిడీ!

సులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడితే అసలుకే మోసం వస్తుంది. ఒక్కసారి సైబర్ నేరస్తుల మాటల మాయలో పడితే చాలు బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. లక్కీడ్రా తగిలిందనో.. గిఫ్ట్ కూపన్ గెలుచుకున్నారనో.. ఒక్కసారి పెట్టుబడితో డబ్బు రెట్టింపు అవుతుందనో చెబుతూ సైబర్ మాయగాళ్లు వల వేస్తున్నారు. కొందరు ఆ వలలో చిక్కి డబ్బు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయించి ఎంతో కొంత వెనక్కి పొందుతున్నారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



• అత్యాశపడితే అసలుకే మోసం • రూ.కోట్లలో ప్రజలకు టోకరా • అప్రమత్తతే రక్షణ

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

ఆర్థిక మోసాలు, చిన్నారులు, మహిళలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్థిక మోసాలకు సంబంధించి ఫిర్యాదు చేసే సమయంలో సంబంధిత బ్యాంకు /వాలెట్, లావాదేవీకి సంబంధించి 12అంకెల ఐడీ /యూటీఆర్ నంబరు, మోసం జరిగిన తేదీ, ఎంత మొత్తం, ఇందుకు అవసరమైన సాఫ్ట్‌కాపీ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. https:// www. cybercrime. gov. in/ వెబ్‌సైట్ ద్వారా గానీ 1930 నంబరుకు డయల్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చు.

పోలీసుల అవగాహన

సైబర్‌నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో జాగృతి దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ బుధవారం ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో స్కూళ్లు, కాలేజీల్లో, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కొన్ని సంఘటనలు..

- మంచిర్యాలకు చెందిన రాజ్‌కుమార్(పేరు మార్చాం) సమాజంలో పేరున్న వ్యక్తి. ఓ రోజు తన ఫేస్‌బుక్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ రాగా అక్సెప్ట్ చేశాడు. అదే రోజు రాత్రి వాట్సాప్‌కు హాయ్ అంటూ మెసేజ్ రావడం, ఆ తర్వాత వీడియో కాల్ చేయడం జరిగాయి. కాల్ లిఫ్ట్ చేయగానే ఓ మహిళ నగ్నంగా కనిపించింది. ఆ తర్వాత ఫోన్ కట్ అయింది. ఇక ఇద్దరి ఫొటోలు మార్ఫింగ్ చేసి ఆ మహిళ డబ్బులు డిమాండ్ చేసింది. పరువు పోతుందనే భయంతో రూ.10వేలు పంపించాడు. అంతటితో ఆగకుండా బ్లాక్‌మెయిల్ చేయడంతో పోలీసులను ఆశ్రయించి విముక్తి పొందాడు.
- మంచిర్యాలలోని గౌతమినగర్‌కు చెందిన ఓ వ్యాపారికి లక్కీ డ్రా తగిలిందని వాట్సాప్ లింకుతో మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేసి చూడగా ఓటీపీ వస్తుందని, ఓటీపీ చెప్పగానే బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని సమాచారం ఉంది. ఓటీపీ చెప్పడంతో క్షణాల్లో అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.3.10లక్షలు డ్రా అయ్యాయి. మోసపోయానని గ్రహించిన సదరు వ్యాపారి వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగి మూడు రోజుల్లోనే వ్యాపారి కోల్పోయిన నగదును ఇప్పించారు.
- ఆదిలాబాద్‌లో ఓ మహిళ ఇన్‌స్టాగ్రాంలో లక్కీ కూపన్ వచ్చిందనే సమాచారం మేరకు మొదట రూ.20వేలు చెల్లించింది. జీఎస్టీ ఇతర సమస్యలు అంటూ రూ.80వేల వరకు సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. మోసపోయానని గ్రహించిన సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు కూపన్లను నగదుగా మార్చుకోవచ్చు, ఏవైనా వస్తువులు కొనుగోలు చేయవచ్చంటూ ఐదేసి కూపన్లు పంపించాడు. ఒక్కో కూపన్ విలువ రూ.20వేలు అంటూ నమ్మించాడు. మరో ఉన్నతాధికారి పేరిట మెసేజ్ రావడంతో నిజమని నమ్మి ఒకరు రూ.లక్ష పంపించారు. మళ్లీ మరో రెండు కూపన్లు పంపించడంతో అనుమానం వచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 239 సైబర్ కేసులు నమోదయ్యాయి. వీటిల్లో చాలా వరకు బాధితులు డబ్బులు కోల్పోవాల్సి వచ్చింది.

- మంచిర్యాల జిల్లాలో గత ఏడాది 177 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 183మంది బాధితులు రూ.1,96,76,132 పోగొట్టుకున్నారు.
- రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎన్‌సీఈఆర్‌టీ పోర్టల్ ద్వారా స్వీకరించిన కేసుల్లో రూ.21,97,337 మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు.
- నిర్మల్ జిల్లాలో 2022లో 41 సైబర్ కేసులు నమోదు కాగా, 2023లో 17 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది బాధితులు రూ.1,38,80,372 కోల్పోయారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానిత వ్యక్తుల్లోని బ్యాంకు ఖాతాల్లో రూ.25,49,759 ఫ్రీజ్ చేశారు. రూ.5,62,175 బాధితులకు తిరిగి ఇప్పించారు.
- కుమురంభీం జిల్లాలో గత ఏడాది 26 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2022 సంవత్సరంతో పోల్చి చూస్తే 2023లో సైబర్ నేరాలు 23.53శాతం తగ్గాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో 2022లో 27 కేసులు నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదయ్యాయి.

వెంటనే ఫిర్యాదు చేయాలి



సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు గానీ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కు గానీ ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉచితంగా ఏదీ రాదు. వాట్సాప్ గ్రూపుల్లో ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దు. ఎలాంటి సమాచారం ఎవరికీ ఇవ్వొద్దు. గుర్తు తెలియని వ్యక్తుల వీడియో కాల్స్ లిఫ్ట్ చేయకూడదు. కొందరు సాధారణ కాల్స్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, అకౌంట్ అప్‌డేట్ చేయాలని వివరాలు అడుగుతారు.. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదు. సైబర్ నేరగాళ్లు వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

జాతీయ సదస్సుకు ఆహ్వానం



సోమేశ్వర్

బోథ్: భారత వికసిత్ కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు జరగనున్న జాతీయ యువజన సదస్సుకు మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్‌కు కేంద్రం యువజన మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందింది. గతంలో కర్ణాటక, ఢిల్లీలో జరిగిన కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నట్లు సోమేశ్వర్ తెలిపారు.

విధులను ఆటంకపర్చిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జైలు నుంచి రిమాండ్ ఖైదీలను కోర్టుకు తీసుకువచ్చిన ఎస్కార్ట్ విధులను ఆటంకపర్చిన ఇద్దరిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని శనివారం కోర్టుకు తీసుకువచ్చారు. వారి స్నేహితులైన రవీంద్రనగర్‌కు చెందిన రాకేష్, దోబికాలనీకి చెందిన వీరకుమ్ర రాజు వారికి భోజనం ఏర్పాటు చేస్తామని, ఇతర వస్తువులు ఇస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విధులను ఆటంక పరిచారని ఏఆర్ హెడ్ కానిస్టేబల్ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆటోను దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఓ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం దగ్ధం చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. కాలనీలో పార్కింగ్ చేసి ఉన్న ఆటోను అర్ధ రాత్రి దగ్ధం చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు పరమేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
O.A. No. 990 of 2022
BWTWEEN
M/s. HDFC Bank Ltd., ...Applicant
AND
Mr. Maduri Goutham Reddy ...Defendant
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
1. Mr. Madduri Goutham Reddy, S/o. Mr. Nagamalleswaram Reddy Madduri, H. No. E-585, NGO Colony, Vanasthali Puram, Hyderabad -500070.
Also at: Mr. Nagamalleswaram Reddy Madduri, S/o. Ann Reddy, D. No. 62-161, Nagaruna Colony, Manadimaam, Adilabad -504231, TS. ...Defendant
Please take the summons in the above O. A. No. 990 of 2022 filed by the Applicant for Recovery of money of Rs. 58,72,234.84/- (Rupees Fifty Eight Lakhs Seventy Two Thousand Two Hundred Thirty Four And Eighty Four Paise Only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Sakshi" Telugu Daily" news paper and posted the matter to 12-02-2024.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 12.02.2024 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this Day of 29th December 2023.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal - II
Hyderabad.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

• కారు, సెల్‌ఫోన్ స్వాధీనం
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌రూరల్: గతేడాది డిసెంబర్ 18న మావల సమీపంలో దళిత యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు ఉష్కం రఘుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ ఉమేందర్ శనివారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మావల గ్రామానికి చెందిన ఎంబడి వంశీతో రఘుపతి కూతురుకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో వంశీని ఎలాగైనా హత్య చేయాలని రఘుపతి నిర్ణయించుకున్నాడు. నవంబర్ 25న చౌహాన్ రవి, అశోక్‌లతో రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని ముందుగా రూ.లక్ష ఇచ్చేశాడు. నవంబర్ 29న వారిని కారులో తీసుకెళ్లి వంశీ ఇంటిని చూపించాడు. హత్య చేయడానికి జీపు కావాలని అశోక్ దిల్షాద్‌ను సంప్రదించగా ఆయన రాజుతో మాట్లాడి జీపును సిద్ధం చేశాడు. హత్యాయత్నానికి ఒకరోజు ముందు రవి, అశోక్ గ్రామంలో రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 18న ఉదయం 5 గంటల ప్రాంతంలో వంశీ ఇంటినుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లగా వెనుకనుంచి జీపుతో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వంశీ తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చౌహాన్ రవి, అశోక్, దిల్షాద్, రాజు, గంగన్నలను గతంలోనే అరెస్టు చేయగా శనివారం ఉష్కం రఘుపతి మావల గ్రామానికి వస్తున్నాడని సమాచారం రావడంతో మావల శివారు ప్రాంతంలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు, మావల ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

• రూ.4 లక్షల నగదు, రెండు తులాల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీకి చెందిన వ్యాపారి మహ్మద్ గౌస్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం సాయంత్రం సదరు వ్యాపారి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న శుభ కార్యానికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో రూ.4 లక్షల నగదు, రెండు తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో శనివారం ఉదయం ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా విచారణ చేపట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు మృతి



మోహన్ (ఫైల్)

కుంటాల: అనారోగ్యంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సుద్దపు మోహన్ (31)కు శుక్రవారం మధ్యాహ్నం బీపీ ఎక్కువ కావడంతో బస్టాండ్ ప్రాంతంలో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్‌కు తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన తాజ్ అహ్మద్ (23) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన తాజ్ అహ్మద్ శనివారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

దండేపల్లి: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రెబ్బనపల్లికి చెందిన గోళ్ల పూర్ణచందర్ ఇంట్లో శనివారం గ్యాస్ సిలిండర్ పేలింది. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బీరువాలో దాచిన సుమారు రూ.3 లక్షల నగదు, నగలు, బట్టలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

భైంసాటౌన్: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారి శ్రావణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక, ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు (2022–23 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు) ఈ ఉపకార వేతనాలకు అర్హులని, ఆయా కోర్సుల్లో విద్యార్థుల మార్కుల శాతం ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు ఫారాలు పొందవచ్చని, పూర్తి చేసిన ఫారాలను ఫిబ్రవరి 15లోగా సంబంధిత కార్మికశాఖ కార్యాలయాల్లో అందించాలన్నారు. పది, ఐటీఐ విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ(అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్) బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లమా/పీజీ ఇన్ మెడికల్ లాబోరేటరీ టెక్నీషియన్ విద్యార్థులకు రూ.2వేల చొప్పున ఉపకార వేతనాలు ఉంటాయని, ఎంపికైన వారికి మేడే నాటికి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



కాలిన పత్తి బేళ్లు

బోథ్: మండల కేంద్రంలోని శ్రీదత్త జిన్నింగ్ మిల్లులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. పత్తి జిన్నింగ్ అయ్యే క్రమంలో మిషన్‌లో ఉన్న బెల్టు తెగిపోవడంతో జిన్నింగ్ మిషన్‌లో బండరాళ్లు రాపిడికి గురయ్యాయి. దీంతో మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. అప్రమత్తమైన జిన్నింగ్ ఫ్యాక్టరీ సిబ్బంది నీటితో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం పేర్కొంది.

సెల్ఫ్ సర్వీస్!

• పెద్దాస్పత్రిలో రోగులపై నిర్లక్ష్యం



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది. అయితే ఇదంతా నాణేనికి ఒక వైపేనని చెప్పాలి. ఇక్కడ వైద్యసేవలు మెరుగుపడినా చికిత్స కోసం వచ్చే రోగుల విషయంలో సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అనారోగ్య సమస్యలు, ప్రమాదాల బారిన పడిన వారు వచ్చినప్పుడు వీల్ చైర్, స్ట్రెచర్‌పై ఆయా విభాగాల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రధాన ద్వారం వద్ద సిబ్బందిని కేటాయించడంలేదు. శనివారం ఉదయం అనారోగ్యంతో ఉన్న పేషెంటును 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. జిల్లా ప్రధాన ద్వారం వద్ద వీల్ చేర్ ఉన్నా లోపలికి తీసుకెళ్లడానికి సిబ్బంది లేకపోవడంతో పేషెంట్ బంధువులే ఇబ్బంది పడుతూ స్ట్రెచర్‌పై పడుకోబెట్టి వైద్యుడి వద్దకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

• శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో



వివరాలు తెలుసుకుంటున్న వికాస్ మహతో

ఇంద్రవెల్లి: కొలాం గిరిజన గ్రామాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడను సందర్శించారు. కొలాం గిరిజనులతో సమావేశమై వారి స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా కొలాం గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించడం జరుగుతుందన్నారు. సీసీ రోడ్లు, తాగు నీటి సౌకర్యం, విద్యుత్, డ్రెయినేజీలు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఇండ్లు, వ్యక్తిగత రుణసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15న నుంచి పథకం అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్క పూలాబాయి, పంచాయతీ కార్యదర్శి జరీనా, తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా ఉట్నూరు



ఉట్నూరు విద్యార్థులకు బహుమతి అందజేసిన ఎమ్మెల్యే కూనంనేని, పీవో ప్రతీక్‌జైన్

• కిన్నెరసానిలో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీలో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఇక రెండో స్థానాన్ని భద్రాచలం ఐటీడీఏ పరిధి విద్యార్థులు దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జిల్లా బృందం



శిల్పారామంలో జానపద గీతికలను ప్రదర్శిస్తున్న జిల్లా కళాకారులు

నిర్మల్ ఖిల్లా: హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర యువజనోత్సవాల్లో నిర్మల్ జిల్లాకు చెందిన చెనికారపు నాగరాజు కళాకారుల బృందం శనివారం ప్రదర్శన ఇచ్చింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో జిల్లా స్థాయి ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి నాగరాజు కళాకారుల బృందం ఎంపికైంది. శనివారం శిల్పారామంలో పల్లె పదాలను ఉట్టిపడేలా పాడిన గీతాలు అలరించాయి. నాగరాజు, శ్రీకాంత్, సల్మాన్, సాయిరాం, రాజు, పెంటన్న, స్వామి, రాజశేఖర్, వినోద్, సుప్రియ, మంజుల పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ 18-28 సం॥ల యువతి యువకులకు,RS 49 K స్వల్ప పెట్టుబడిలోకల్‌ఫ్రాంఛైజీతో పర్మినెంట్‌బిజినెస్ ఆదాయం. మల్టీ సర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్@15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ WWI-Hyd. Ph: 9908743603 [HA-2583]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

■ We are Ready to Invest Long Term Projects All over the world: +91 8754809650 [HA-7025]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1167584]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ హైదరాబాద్ లోని స్టార్ హోటల్స్‌కి క్యాటరింగ్‌బాయ్స్ & హెల్పర్స్, సె॥ గార్డ్స్, సూపర్ వైజర్స్ కావలెను. జీ॥ 15000/- 21500/- రూం + మీల్స్ ఫ్రీ. ఫోన్: 7386048444. [H-801460]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్ భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12597]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793674]



For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.